



విజయనగరం: పైడిమాంబ ఆలయం



నెల్లిమర్ల: రామతీర్థం ఆలయం వద్ద అర్చకులు

ఆలయాల మూసివేత

● సంపూర్ణ చంద్రగ్రహణమే కారణం

● నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం తిరిగి దర్శనాలు

విజయనగరం రూరల్/ కల్చరల్/ నెల్లిమర్ల/బొబ్బిలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. రాత్రికి సంపూర్ణ చంద్రగ్రహణం ఉండడంతో అర్చకులు ఆలయాలను తాత్కాలికంగా మూసివేశారు. మళ్లీ సోమవారం తెల్లవారుజామున వేదపండితులు, అర్చకులు సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం తెరుచుకోనున్నాయి. పైడిమాంబ ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు తిరిగి భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. అదే విధంగా నగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని ఆలయాలను మూసివేశారు.

● చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానాన్ని కూడా అధికారులు ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 10.30 గంటలకు (మిగతా 8వ పేజీలో..)



బొబ్బిలి: మూతపడిన వేణుగోపాలస్వామి ఆలయం

గిరిజనుల్లో గతం కంటే అక్షరాస్యత పెరిగినా ఉన్నత చదువును మాత్రం కొందరే పొందగలుగుతున్నారు. పేదరికం ఒక కారణం కాగా వారుంటున్న ప్రాంతాలకు దగ్గరలో విద్యా సంస్థలు లేకపోవడం మరో కారణం. గిరిజన గ్రామాలతో పాటు కొండ శిఖర గ్రామాలకు రహదారులు లేకపోవడంతో ఇంకొందరు ఆదిలోనే చదువు ఆపేస్తున్నారు. మొత్తంగా పది, ఇంటర్, సాధారణ డిగ్రీలకే గిరిజన యువత పరిమితమవుతోంది. నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకుని గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యతపై ప్రత్యేక కథనం.

ఉన్నత చదువులకు దూరమే



రాళ్ల రహదారిలో పాఠశాలకు వెళ్తున్న గిరిజన బాలలు

● గిరిజన గ్రామాల్లో గతం కంటే కాస్త మెరుగు

● కార్పొరేట్ విద్యను అందుకోలేని వైనం

● పది, ఇంటర్, సాధారణ డిగ్రీలకు పరిమితమవుతున్న యువత

● కొండ శిఖర ప్రాంతాల వారి పరిస్థితి మరీ దయనీయం

● నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



ఎస్.కోట గిరిజన ఆశ్రమ పాఠశాల

శృంగవరపుకోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి)

శృంగవరపుకోట మండలం దారపర్తి, గూనపాడు, కురిడి, పల్లపు దుంగాడ గ్రామాలు కొండ శిఖరాన ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆ గ్రామాల్లో 1029 మంది నివశిస్తుండగా 167 మంది మాత్రమే అక్షరాస్యులున్నారు. వీరి లోనూ ఐదు నుంచి పదో తరగతిలోపు చదువుకున్నవారే ఎక్కువ. ఇంత చదివినా రాయడం, చద వడం తప్ప మరే విజ్ఞానం లేదు. ఎందుకంటే వీరు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు. గూనపాడు, పల్లపు దుంగాడ గిరిశిఖర గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఒకట్రెండు సంవత్సరాల క్రితం వరకు రహదారి సదుపాయం లేక ఉపాధ్యాయులే సరిగా వెళ్లేవారు కాదు. ఇక ఆరోతరగతి చదవాలనుకుంటే కొండదిగువన ఉన్న గ్రామాలకు 8 కిలోమీటర్లు నడిచి చేరుకోవాలి. దీంతో చదవడం, రాయడంతోనే అక్షరాస్యత శాతం లెక్కల్లోకి ఎక్కుతున్నారు. గిరిజన గ్రామాల్లో పరిస్థితికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పల్లెలు చాలా ఉన్నాయి. గిరిశిఖర గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయి విద్యను ప్రభుత్వాలు అందివ్వలేకపోతున్నాయి. వారి చెంతకు విద్యా సంస్థలను తీసుకెళ్ల లేకపోతున్నాయి.

కొన్ని దేశాలు వెనకబడి ఉండడానికి నిరక్షరా స్యతే కారణమని 1965 నవంబర్ 17న యునె స్కో సభ్యదేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ గుర్తించింది. అక్షరాస్యతను పెంచేందుకు 1966 నుంచి సెప్టెంబరు 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం జరుపుతున్నారు. మన దేశంలో బీహార్, ఏపీ అక్షరాస్యతలో వెనకబడి ఉన్నాయి. రాష్ట్రంలో విజయనగరం జిల్లా 58.89శాతం అక్షరాస్యతతో వెనకబాటులోనే ఉంది. గిరిజన అక్షరాస్యతకు సంబంధించి నిర్దిష్టమైన లెక్కలు (మిగతా 8వ పేజీలో..)

పశు సంచార వైద్యశాలల జాడేది?

● ఆ వాహనాల్లో మందుల కొరత

● మారుమూల ప్రాంతాలకు వెళ్లడం లేదన్న విమర్శ

● నిరాశలో పశువుల పెంపకందారులు



రాజాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. సీజన్ మారుతోంది. ముఖ్యంగా పశువుల్లో గాలికుంటు, ఇతర రుగ్మతలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో వాటికి వైద్యం అందివ్వాల్సిన పశుసంచార వైద్యశాలల జాడ మాత్రం కానరావడం లేదు. ఆ వాహనాలు ప్రధాన ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. మారుమూల గ్రామాల వైపు చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక వేళ వెళ్లినా పశు వైద్యానికి తగ్గట్టు మందులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు షాపుల్లో కొనుగోలు చేసుకుంటున్నారు. ఇది రైతులకు అదనపు భారంగా మారుతోంది.

గత ప్రభుత్వం పశువైద్యం విషయంలో చాలా నిర్లక్ష్యం చేసింది. పశుసంవర్థక శాఖలో పనిచేసే పశు వైద్యశాలలను సరిగ్గా నిర్వహించలేదు. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోలేదు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పశు ఆరోగ్య సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. తొలి విడతగా జిల్లాకు ఏడు వాహనాలు అందించింది. మలి విడతగా మరో 6 వాహనాలు అందించింది. దాదాపు అన్ని నియోజకవర్గాలకు రెండు చొప్పున వాహనాలు సమకూరాయి. ఒక్కో వాహనంలో పశు వైద్యాధికారి, వైద్య సహాయకుడు, డ్రైవర్ ఉంటారు. ప్రయోగశాలతో పాటు మందులు అందుబాటులో ఉంచాలి. పశువులు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వాటికి ప్రాథమిక (మిగతా 8వ పేజీలో..)

ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లిన కారు

● ఇద్దరి మృతి ● మరొకరికి గాయాలు

● కారు డ్రైవర్ పరారీ



గోడను ఢీకొని ఆగిన కారు

జామి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శిరికిపాలెం వద్ద ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ముందు వెళ్తున్న మూడు ద్విచక్ర వాహనాలపైకి కారు దూసుకెళ్లి గోడను ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కొత్తవలస మండలం కాటకాపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారులో వస్తూ శిరికిపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో ముందు వెళ్తున్న మూడు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొన్నాడు. ఆపై గోడను ఢీకొన్నాక కారు ఆగింది. ప్రమాదంలో జామి మండలం శిరికిపాలెంకు చెందిన బోనీ సాగర్(24), లక్కవరపుకోట మండలం భీమాళికి చెందిన గుల్లిపల్లి సురేష్ (32)లు ఘటనాస్థలంలో (మిగతా 8వ పేజీలో..)



మృతిచెందిన సురేష్



సాగర్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

జాతీయ లోక్ అదాలత్‌కు సన్నద్ధం కావాలి

● ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి: ఎస్పీ వకుల్‌జిందాల్



విజయనగరం క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో ఈనెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల్లో ఇరువర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్, రోడ్డు ప్రమాద కేసులు, ఇతర కాంపౌండ్ కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలను సంప్రదించి సమావేశాలు నిర్వహించి రాజీ అయ్యేలా మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. పోలీసుస్టేషన్ స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను ప్రతి రోజూ పర్యవేక్షించాలని, లోక్‌అదాలత్ విజయవంతం అయ్యేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల న్నారు. కేసుల్లోని ఇరువర్గాలపై ఒత్తిడి లేకుండా రాజీ అయ్యేలా వారిని ప్రోత్సహించా లన్నారు. ప్రతిరోజు ఆయా సబ్ డివిజన్‌కు చెందిన డీఎస్పీలు, సీఐలు కీలక కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు.

రైతులు ఆందోళన చెందవద్దు

రెండో విడత యూరియాకు సమయం ఉంది: కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులకు కొరతలేదని అవసరమైన ప్రాంతాలకు సమయానికి సరఫరా చేస్తామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో 30 మంది రైతులు కలెక్టర్‌తో నేరుగా మాట్లాడారు. 25 మంది రైతులు రెండో విడత ఎరువులు అందడం లేదని ప్రస్తావించగా కలెక్టర్ స్పందిస్తూ రెండో విడత యూరియా వేయడానికి ఇంకా సమయం ఉందని, శాస్త్రవేత్తల సూచన మేరకు పంట వేసిన 35-40 రోజులు తరువాత మాత్రమే రెండో విడత ఎరువులు వేయాలన్నారు. ఆ సమయానికి యూరియా అందజేస్తామని, రైతులు ముందుగానే కొనేందుకు రావాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎకరాకు మూడు దఫాలుగా 25 కేజీలు చొప్పున మాత్రమే యూరియా వాడాలని సూచించారు. రెండో విడత యూరియా సరఫరాకు ఇంకా సమయం ఉన్నందున మరో 10 రోజుల్లో రెండవ విడత ఎరువులు అందజేస్తామని భరోసా ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ రామారావు ఉన్నారు.



ఆధార్ సేవా కేంద్రాలు రెవెన్యూ కార్యాలయాల్లోనే..

● భూములకు ఆధార్ అనుసంధానం కోసమే.. ● రైతులకు తప్పనున్న అగచాట్లు ● అమలుకు అధికారుల సన్నాహాలు

కొత్తవలస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములకు సంబంధించి ప్రభుత్వం ఒక సమస్యను పరిష్కరిస్తుంటే మరో సమస్య వస్తోంది. ప్రధానంగా ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఓ ప్రహసనంగా సాగుతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం కొత్త విధానం తీసుకొస్తోంది. భూములకు ఆధార్‌ను అనుసంధానం చేయడం కోసం రెవెన్యూ కార్యాలయాలలోనే ఆధార్ సేవాకేంద్రాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. భూములు ఆధార్‌తో అనుసంధానం కాకపోవడంతో చాలా మంది రైతులకు రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన అన్నదాతా సుఖీభవ, పంటల బీమా, పంటల పెట్టుబడి అందడం లేదు. ఈ పరిస్థితిలో భూ వ్యవహారాలకు సంబంధించి ఆధార్‌సేవల నిర్ధారణకు వినియోగదారుల సేవల సంస్థగా రాష్ట్ర రెవెన్యూశాఖ ఎంపికైంది. ఈ మేరకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ(యూఐఏ) రాష్ట్రప్రభుత్వానికి సమాచారం అందజేసింది. రెవెన్యూశాఖను భూములు సంబంధిత వ్యవహారాలలో ఆధార్‌యూజర్ ఏజెన్సీగా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆధార్‌తో భూముల అనుసంధాన ప్రక్రియలో ఇకపై రెవెన్యూశాఖ కీలక పాత్ర పోషించనుంది. ప్రస్తుతం ఆధార్ నిర్ధారణకు యూజర్ ఏజెన్సీలు, ప్రైవేటు సంస్థల ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో రైతుల వివరాలు, ఆధార్ సీడింగ్, ఆధార్ అథెంటికేషన్ (మిగతా 8వ పేజీలో..)

నేడు మంత్రి పర్యటన

మెంటాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం మెంటాడ మండలంలో పర్యటించనున్నారు. ఇటీవల వర్షాలకు కూనేటిగెడ్డకు పడిన గండిని, కొట్టుకుపోయిన జగన్నాథపురం పైపు కల్వర్టు ప్రాంతాన్ని ఆమె పరిశీలించనున్నారు.

వెయిట్ లిఫ్టర్‌కు ఎమ్మెల్యే అభినందన

విజయనగరం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సీనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2025లో ప్రతిభ కనబరిచిన షీలా రామకృష్ణను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదివారం అభినందించారు. జంషడ్‌పూర్‌లో జరిగిన ఈ పోటీల్లో పవర్ లిఫ్టింగ్ 510 కిలోల విభాగంలో రామకృష్ణ నాలుగో స్థానం సాధించగా, బెంచ్‌ప్రెస్ 140 కిలోల విభాగంలో స్వర్ణ పతకం దక్కించుకున్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు కైవసం చేసుకోవాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే తెలిపారు.

పాలవలస కుటుంబాన్ని కలిసిన ఆర్.నారాయణమూర్తి



పాలవలస కుటుంబంతో మాట్లాడుతున్న నారాయణమూర్తి

రాజాం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని సారధి రోడ్డులో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు పాలవలస శ్రీనివాస రావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పాలవలస పద్మావతిలను ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి ఆదివారం గౌరవపూర్వకంగా కలిశారు. వారి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం ఐఏఎస్ జి.సురేష్ దంపతులను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, దూబ గోపాలం పాల్గొన్నారు.

13న ఇంటింటికీ జనసేన



మాట్లాడుతున్న జనసేన నాయకులు

భోగాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీలో ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటింటికీ జనసేన కార్యక్రమానికి అందరూ సిద్ధం కావాలని జనసేన నాయకుడు పల్లంట్ల జగదీష్ కోరారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్ల రాంబాబు, బొల్లు త్రినాథు, మాతా నవీన్, గుండపు సూర్యారావు, వరుపుల సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

నెల్లిమర్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జరజాపుపేటలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కనకల పద్మనాభం ఆధ్వర్యంలో జెండా స్తంభాన్ని ఏర్పాటు చేయగా, పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకుని, కేసు నమోదు చేశామని సీఐ నారాయణమూర్తి తెలిపారు. తమకు వచ్చిన సమాచారంతో దాడి చేసి, ఐదుగురు జూదరులను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7,200 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

షార్ట్ షర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం

లక్కవరపుకోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లాపల్లి గ్రామంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో ఐదు పూరిళ్లు దగ్ధమయ్యాయి. అందులో మూడు పూర్తిగాను, రెండు పాక్షికంగానూ దగ్ధమైనట్టు సర్పంచ్ గోగాడ సత్యం తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ సన్యాసిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, నివేదికను సమర్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

భోగాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ సుందరపేట సమీపంలో గల కె.విశ్వేశ్వరరావు రైతు పొలంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. సంబంధిత రైతు తీర్థ యాత్రలకు వెళ్లి, ఆదివారం తిరిగి వచ్చారు. పొలానికి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ కనిపించలేదు. చోరీకి గురైనట్టు గుర్తించారు. పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తానని రైతు తెలిపారు.

మంత్రి దృష్టికి సమస్యలు

వంగర, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వంగర మండలంలో చిరకాలంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాజాం మార్కెట్ యార్డు వైస్ ఛైర్‌పర్సన్ ఎల్.ధనలక్ష్మి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. ఆదివారం ఆమె శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలో గల మంత్రి నివాసానికి వెళ్లి ఆయన్ని మర్యాద పూరకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు కృష్ణమూర్తి ఉన్నారు.

అధ్వానంగా నగర రహదారులు

- పండుగ సమీపిస్తున్నా కానరాని మరమ్మతులు
- నాణ్యతకు తిలోదకాలు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ప్రభుత్వం ఏర్పాటైన మూడునెలల కాలంలోనే రూ.45 లక్షలతో విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు రహదారులకు మరమ్మతులు చేశారు. అయితే ఏడాది కాలం కాకముందే ఆ రోడ్లు మళ్లీ పాడయ్యాయి. గుంతలమయంగా మారాయి. ప్యాచ్‌వర్క్‌లు చేసే సందర్భంలో కూడా నాణ్యత లేకుండా పనులు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంజనీరింగు సిబ్బంది, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది పర్యవేక్షణ కొరవడంతో కాంట్రాక్టర్లకు ఎంచక్కా బిల్లులు చెల్లించేశారు. అయితే ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు ఈ రోడ్లు మరింత పాడయ్యాయి. మరో నెల రోజులో ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ పండుగ రానుంది. గుంతల రోడ్లు పూడ్చితే తప్ప, రోడ్లు బాగుపడే పరిస్థితి లేదు. దీనిపై నగరపాలక సంస్థ ఇంజనీరింగు అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



ధర్మపురి రోడ్డులో ఏర్పడిన గుంతలు



అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డు ఇలా..

నగరంలోని అంబటి సత్తర్వు నుంచి కొత్తపేట రోడ్డు, ఫూల్‌బాగ్ రోడ్డు, వైఎస్సార్ నగర్ రోడ్డు, కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, కోట నుంచి గుమ్చీ రోడ్డు, గుమ్చీ నుంచి ఐయ్యకోనేరు దక్షిణ గట్టు, రింగురోడ్డు రైతుబజారు జంక్షన్, ఐస్‌ఫ్యాక్టరీ నుంచి ధర్మపురికి వెళ్లే రహదారి తదితర ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ చేసినా గుంతలు తిరిగి యథాస్థితికి చేరాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు మంజూరయ్యాయి

ఇదే విషయాన్ని నగరపాలక సంస్థ ఇంజనీరింగు విభాగం ఈఈ ప్రసాద్‌ని వివరణ కోరగా, ఇటీవల రూ.35లక్షలతో నిధులు మంజూరు అయ్యాయని, వీటితో అక్టోబరు నెల తొలి వారంలోగా పాడైన రహదారులకు మరమ్మతులు చేపడతామని తెలిపారు.

జేఎన్‌టీయూ వీసీ రాజ్యలక్ష్మికి లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డు



విజయనగరం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం గురజాడ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డి.రాజ్యలక్ష్మికి సీఎస్ఈ ఇండియా ప్రతిష్టాత్మ క లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డు ఫర్ అకాడమిక్ లీడర్ షిప్‌ను అందజేసింది. ఈసందర్భంగా ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఉత్సాహంగా పనిచేసేం దుకు ఇటువంటి అవార్డులు ఎంతగానో ఉపయోగప డతాయన్నారు. అవార్డు స్వీకరించిన వీసీ రాజ్యలక్ష్మిని రిజిస్ట్రార్ జి.జయసుమతో పాటు యూనివర్సిటీ డైరక్టర్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫారెస్టు బీటు ఆఫీసర్ పరీక్షకు 82.21 శాతం హాజరు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో ఫారెస్టు బీటు ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లాలో 82.21 శాతం అభ్యర్థులు పరీక్ష రాశారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 14 కేంద్రాల్లో ఉదయం 6,308 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా, 5224 మంది రాశారు. 1084 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. 82.82 శాతం హాజరయ్యారు. రెండో పూట జరిగిన పరీక్షకు 910 మంది హాజరు కావల్సి ఉండగా, 710 మంది రాశారు. 200 మంది హాజరు కాలేదు. 78.02 శాతం హాజరయ్యారు. రెండు పూటలు కలిసి 7218 రాయాల్సి ఉండగా, 5934 మంది రాశారు. 1284 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. 82.21 మంది హాజరయ్యారు.

వినాయక నిమజ్జనంలో కొట్లాట

విజయనగరం క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల నాగవంశం వీధిలో శనివారం అర్ధరాత్రి జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావుపై అదే కాలనీకి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అప్పారావు గాయాలపాలయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి కుమారుడు గాడు గిరిష్ చేసిన ఫిర్యాదు మేరకు మద్దిల వికీల్, అవనాపు చిన్నయ్య, కంటిబుక్త గౌతమ్, కంటుబుక్త రాము, చెల్లూరు భార్గవ్, రాళ్ల సూరిబాబు, కనకల గిరి, కాళ్ల రవితేజ, కంటుబుక్త వర్ధన్, మణికంఠ పంతులుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రవి తెలిపారు.

పోరాటాలతో హక్కులు సాధిస్తాం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
- సంఘం జిల్లా మహాసభలు ప్రారంభం



రాజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారా కార్మిక, కర్షకుల హక్కులు సాధిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు స్పష్టం చేశారు. రాజాంలో ఆదివారం ప్రారంభమైన సీఐటీయూ 11వ జిల్లా మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రూ.26వేలు కనీసవేతనంగా ఇవ్వాలని, అవుసోర్సింగ్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకు ముందు బస్టాండ్ నుంచి చీపురుపల్లి రోడ్డులోని సభా ప్రాంగణం వరకూ పెద్దసంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్బ రావమ్మ, సురేష్‌తో పాటు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటికొచ్చిన శ్మశానవాటిక వివాదం



పంచాయతీ కార్యాలయానికి వచ్చిన తమ్మన్నమెరక గ్రామస్థులు

కొత్తవలస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక, తమ్మన్నమెరక గ్రామాల మధ్య నెలకొన్న శ్మశానవాటిక వివాదం మళ్లీ మొదటికొచ్చింది. గతంలో ఈ రెండు గ్రామాలకు వేర్వేరుగా శ్మశానవాటికలు ఉండేవి. జోడుమెరక గ్రామానికి చెందిన శ్మశానవాటిక స్థలాన్ని కొంతమంది ఐదేళ్ల కిందటే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారు. దీంతో ఆ గ్రామస్థులు అప్పటి నుంచి తమ్మన్నమెరక శ్మశానవాటికను వినియోగిస్తున్నారు. ఈ విషయంలో ఈ రెండు గ్రామాల మధ్య వివాదం నడుస్తోంది. ఈక్రమంలో తమ్మన్న మెరక గ్రామస్థులు ఆదివారం అప్పన్నదొరపాలెం పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. దీనిపై సర్పంచ్ జోడు రాములమ్మకు ముందుగా సమచారం ఇచ్చినా ఆమె రాలే దు. అలాగే జోడుమెరక గ్రామస్థులు రాలేదు. దీంతో తమ్మన్నమెరక గ్రామస్థులు చాలా సమయం వేచిచూ సి, తిరిగి వెళ్లిపోయారు. సర్పంచ్ రాములమ్మ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఇకపై జోడుమెరక గ్రామంలో ఎవరు చనిపోయినా తమ గ్రామ శ్మశాన వాటికకు తీసుకువస్తే అడ్డుకుంటామని తమ్మన్నమెరక గ్రామస్థులు స్పష్టంచేశారు.

నేత్రదానంపై అవగాహన

రాజాం సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ, శ్రీకాకుళం మకుటపల్లి కళ్యాణి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 60 మంది వికాస తరంగిణి సభ్యులు నేత్రదాన చేయడానికి మందుకు వచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు కొత్త సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, వికాస తరగంణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సెంచూరియన్ విద్యార్థుల ప్రతిభ



కోచ్ అర్జున్‌తో విజేతలు శ్రీపాద శ్రీజ, మౌనిక

నెల్లిమర్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణాలోని సికింద్రాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఖేలో ఇండియా అస్మిత్ వెయిట్ లిఫ్టింగ్ లీగ్-2025 పోటీల్లో సెంచూరియన్ విశ్వవిద్యాలయం బీబీఏ విద్యార్థులు శ్రీపాద శ్రీజ, బి.మౌనికలు మూడు బంగారం, రెండు వెండి పతకాలను కైవశం చేసుకున్నారు. బీబీఏ విద్యార్థి పి.శ్రీపాద శ్రీజ 40 కిలోల విభాగంలో స్నాచ్, 50 కిలో లు, క్లీన్ అండ్ జెర్క్‌లో 70 కిలోలు కలిసి మొత్తం 120 కేజీల బరువులు ఎత్తి యూత్ శాగంలో స్వర్ణ పథకం సాధించడంతోపాటు జూనియర్ అండ్ సీనియర్ విభాగంలో రెండు రజత పతకాలు కైవశం చేసుకుంది. అలాగే మరో బీబీఏ విద్యార్థి వి.మౌనిక 63 కిలోల కేటగిరిలో స్నాచ్‌లో 80 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 100 కిలోలు బరువులు కలిపి మొత్తం 180 కిలోలు బరువులు ఎత్తి జూనియర్ విభాగంలో స్వర్ణం పతకం, సీనియర్ విభాగంలో మరో స్వర్ణం దక్కించుకుంది. ఈ మేరకు వైస్‌ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్.రావు, చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్.రాజు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, స్పోర్ట్స్ విభాగం అధిపతి డా.ఆర్ఎస్.వర్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆసిఫ్ విజేతలకు, కోచ్ అర్జున్‌కు అభినందనలు తెలిపారు.

ఆలయాల మూసివేత



రాజాం రూరల్: పోలిపల్లి పైడితల్లి ఆలయ తలుపులు మూసివేస్తున్న దృశ్యం

గజపతినగరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ దేవాలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9-54 నిమిషాల నుంచి అర్ధరాత్రి 1.26 నిమిషాల వరకు సుమారు 3-30 గంటల పాటు ఉండడంతో దేవాయాలు మూసివేసినట్టు వేంకటేశ్వర ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. అలాగే పట్టణంలోని పలు దేవాలయాలను మూసివేశారు. గ్రహణం వీడిన తర్వాత సోమవారం తెల్లవారుజామున ఆలయ శుద్ధి చేసిన అనంతరం భక్తులకు ఆలయ ప్రవేశం కల్పిస్తారు. ● వంగర: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగాం సంగమేశ్వర దేవాలయాన్ని చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ ప్రధాన గేట్లు తెరిచి, స్వామికి శుద్ధి స్నానం చేసి భక్తులకు అనుమతిస్తామని అర్చకుడు గణపతి తెలిపారు. ● రాజాం రూరల్: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలోని ప్రధాన ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం మూత పడ్డాయి. పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయంతో పాటు నవదుర్గ అమ్మవారు, జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయం, ఇతర ఆలయాల తలుపులు మూసుకున్నాయి. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాలను తిరిగి తెరవనున్నట్లు పైడితల్లి దేవస్థానం అర్చకుడు సూర్యనారాయణశర్మ తెలిపారు.

రైతు చెంతకే యూరియా

- గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు



సంతకవిటి: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శారదాదేవి

డెంకాడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు వద్దకే యూరియా వచ్చే విధంగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖరరావు తెలిపారు. ఏవో టి.సంగీత ఆధ్వర్యంలో మండలంలో వివిధ గ్రామాలలో ఆదివారం 'రైతు వద్దకే యూరియా' అనే నినాదంతో గ్రామ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాకు 850 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని తెలిపారు. విజయనగరం డివిజన్ ఏడీఏ నాగభూషణరావు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

● సంతకవిటి: అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల నేలసారం తగ్గుతుందని మండల ప్రత్యేక అధికారి ఎస్.శారదాదేవి అన్నారు. ఆదివారం బొద్దూరు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో యశ్వంతరావు మాట్లాడుతూ నానో యూరియాను ఉపయోగించాలని సూచించారు. అనంతరం రాజాం వాణిజ్య విభాగం అధ్యక్షుడు, బొద్దూరు ఎంపీటీసీ వల్లూరు గణేష్ మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. ఎంపీడీవో కె.సురేష్ కుమార్, సంతకవిటి పీఏసీఎస్ ఛైర్మన్ చెలికాని మహేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

● వంగర: రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో కన్నబాబు తెలిపారు. సంగాం గ్రామంలో ఆదివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, నానో యూరియాపై అవగాహన కల్పించారు. బాగెమ్మపేట రైతులకు అరసాడ గ్రోమోర్ కేంద్రంలో సోమవారం యూరియా పంపిణీ చేస్తామని చెప్పారు. ● రేగిడి: నానో యురియా రైతులకు లాభదా యకమని ఏవో శ్రీనివాసరావు అన్నారు. లక్ష్మీపురం, బురాడ, చటాయివలస, కొమిర, సంకిలి గ్రామాల్లో ఆదివారం వ్యవసాయ శాఖ చైతన్య సదస్సులు నిర్వహించారు. ● చీపురుపల్లి: ఎరువుల వినియోగంలో రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచ నలు పాటించాలని మండల ప్రత్యేకాధికారి హేమ సుందర్ అన్నారు. పుర్రేయవలసలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏవో సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. ● దత్తిరాజేరు: రైతులు నానో యూరియా, నానో డీఏపీ పిచికారీ చేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందని మండల ప్రత్యేకాధికారిణి విమలారాణి అన్నారు. దత్తి, రాజులరామచంద్రపురం, లింగరాజుపురం గ్రామాల్లో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో అనూరాధ, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు. ● జామి/ఎస్.కోట రూరల్: మండలంలోని రైతులు యూరియా కొరతపై ఆందోళన చెందవద్దని మండల ప్రత్యేకాధికారి కుమారస్వామి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించి, రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఎస్.కోట రూరల్‌లో ఏవో రవీంద్ర ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.

నా తండ్రిని చంపేశారు

- బాధ్యులపై చర్యలు తీసుకోండి
- మృతదేహంతో ధర్నాకు దిగిన బాధితుడు



మృతదేహంతో ధర్నా చేస్తున్న లక్ష్మునాయుడు

రాజాం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తన తండ్రి ముత్యాల నాయుడు(70) మృతికి కారకులైన ఇద్దరు లారీ డ్రైవర్లపై, సకాలంలో కేసు నమోదు చేయని సంతకవిటి ఎస్ఐపై, అలాగే ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పొనుగుటివలసకు చెందిన కోడూరు లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం రైస్‌మిల్లు ప్రాంగణంలో మృతదేహంతో ధర్నాకు దిగారు. లక్ష్మునాయుడు పోలీసులకు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పొనుగుటివలస గ్రామానికి చెందిన కోడూరు ముత్యాలనాయుడు పాలకొండ రోడ్డులోని లక్ష్మీనారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో ఏడాదిగా నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. గతనెల 14న రాత్రి సమయంలో ఇద్దరు లారీ డ్రైవర్లు ఊక లోడ్ చేసేందుకు వచ్చి మిల్లు ప్రాంగణంలో మద్యం తాగేందుకు ప్రయత్నించగా.. ముత్యాల నాయుడు అభ్యంతరం చెప్పారు. దీంతో కోపోద్రిక్తులైన ఇద్దరు లారీ డ్రైవర్లు ముత్యాలనాయుడిపై కర్రలతో దాడిచేశారు. దీంతో రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించిన ముత్యాలనాయుడికి శస్త్రచికిత్స నిర్వహించారు. అయినా ఫలితం దక్కలేదు. ఈనెల 6న ముత్యాలనాయుడు మృతిచెందారు.

● మృతుడి కొడుకు లక్ష్మునాయుడు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తన తండ్రిని కర్రలతో దాడిచేసి కొట్టిన విషయంపై వెంటనే సంతకవిటి ఎస్ఐ గోపాలరావుకు ఫిర్యాదు చేశానని, అయినా పట్టించుకోలేదని తెలిపారు. మిల్లు యాజమాన్యానికి ఎస్ఐ అనుకూలంగా వ్యవహరించి, వారిపై కేసు నమోదు చేయలేదని ఆయన ఆరోపించారు. దీంతో తన తండ్రి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించి మృతిచెందారని, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని లక్ష్మునాయుడు కోరారు.

కేసు నమోదు చేశాం

ముత్యాలనాయుడిపై దాడి చేసిన వ్యక్తులను గుర్తించాం. వారిపై కేసు నమోదు చేశాం. ఆ కుటుంబానికి న్యాయం చేస్తాం. ప్రతిఒక్కరూ చట్టపరిధిలో వ్యవహరించాలి. చట్టాన్ని వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవు.

- ఉపేంద్రరావు, రాజాం రూరల్ సీఐ

చెరువులో పడి వ్యక్తి మృతి

భోగాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సవరవల్లి పంచాయతీ బుత్తలపేటకు చెందిన బుత్తల లక్ష్మణ(40) అనే వ్యక్తి చెరువులో పడి మృతిచెందారు. దీనిపై ఎస్ఐ పి.సూర్యకుమారి ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుత్తలపేటకు చెందిన బుత్తల కొండమ్మ, లక్ష్మణ అనే భార్యభర్తలు కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే లక్ష్మణ శనివారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని ఇంటి దగ్గర చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఈక్రమంలో ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో మృతదేహం తేలి ఆడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న లక్ష్మి.. వెంటనే అక్కడకు వెళ్లి మృతదేహం తన భర్తదిగా గుర్తించింది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. కొడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ బాలిక..

చీపురుపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చిన ఓ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలానికి చెందిన ఓ బాలిక, పక్క మండలంలోని బాలునితో ప్రేమలో పడింది. తొమ్మిదో తరగతి చదువుతున్న వీరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. ఫిట్స్ రావడంతో ఆమెను విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ బాలిక గర్భంలోని పిండాన్ని తొలగించడానికి శస్త్ర చికిత్స చేసే క్రమంలో ఆమె మృతి చెందింది. పోలీసులు పోక్సో సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు..

సీతానగరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం మరిపివలస - పార్వతీపురం మధ్య గుర్తు తెలియని రైలు ఢీకొని నిడగళ్ల గ్రామానికి చెందిన పి.సూర్యనారాయణ(54) మృతిచెందారు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు చెప్పారు.

పిడుగు పాటుతో ముగ్గురికి గాయాలు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దారపర్తి పంచాయతీ మునపరాయి గ్రామంలో ఆదివారం పిడుగు పాటుకు ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సింబోయిన బుధరమ్మ ఇంటి పక్కనే పిడుగు పడింది. దీంతో ఇంటి బయట ఉన్న బుధరమ్మతో పాటు ఆమె కొడుకు, కోడలు స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే వీరిని స్థానికులు డోలీ ద్వారా మైదాన ప్రాంతమైన దబ్బగుంట తీసుకొచ్చి, అక్కడ నుంచి ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

మహిళ మృతిపై ఆరా



పీహెచ్‌సీ వైద్యాధికారిణితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

భోగాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చినకవులవాడ గ్రామాన్ని డీఎంహెచ్‌వో జీవనరాణి ఆదివారం సందర్శించారు. గ్రామంలో జ్వరంతో ఓ మహిళ మృతిచెందిన నేపథ్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. గ్రామంలో పరిస్థితిని పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మణను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆరా తీశారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. కొంతమందికి వైరల్ జ్వరాలు ఉన్నట్లు గుర్తించి, మందులు అందజేశారు. పది రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డి.వాణి, డీఎస్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మరువాడ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చుక్క అప్పారావు నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ జె.జనార్ధన రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు దూరమే

(ఐదో పేజీ తరువాయి)

అందుబాటులో లేకపోయినప్పటికీ అక్కడి పరిస్థితులను బట్టి ఏమేరకు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

● జిల్లాలో శృంగవరపుకోట మండలం దార పర్తి, పల్లపు దుంగార, గూనపాడు, కురిడి, చిట్టెం పాడు, రేగ పుణ్యగిరి ఇలా దాదాపు 14 గ్రామా లు, వేపాడ మండలంలో మారిక, గంట్యాడ మం డలంలో దిగువ కొండపర్తి గ్రామాలు కొండ శిఖ రంలో ఉన్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోకి వచ్చే కొమరాడ, సాలూరు, పాచి పెంట, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల పరిధిలోనూ కొండశిఖర గ్రామాలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2,14,839 మంది గిరిజనులున్నారు. అక్షరాస్యత శాతానికి సంబంధించి నిర్దిష్టమైన లెక్కలను అధికారులు చెప్పలేకపోతున్నారు.

రోడ్డు లేక చదువుకు దూరం

ఉమ్మడి జిల్లాలో కొండ శిఖర గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సదుపాయం లేదు. ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నా అటవీశాఖ అనుమతులు ఇవ్వడం లేదని సగంలో రోడ్ల నిర్మాణాలను ఆపేశారు. దీనివల్ల గిరిజన పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. కొండ దిగువనున్న గిరిజన గ్రామాల్లో కూడా దాదాపుగా ఒకటి నుంచి ఐదోతరగతి వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆ తరువాత చదువు కోసం మైదాన ప్రాంత గ్రామాలు, పట్టణాలకే వెళ్లాలి. అంత దూరం వెళ్లే అవకాశం ఉండడం లేదు.

● గిరిజనుల్లో దాదాపుగా పేద కుటుంబాలు ఎక్కువ. పోడు వ్యవసాయం తప్ప మరే జీవనాధారం ఉండదు. ప్రభుత్వం అందించే విద్యను మాత్రమే పొందగలుగుతున్నారు.కార్పొరేట్, ప్రైవేటు విద్య అందుబాటులోకి రాకముందు అందరితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉద్యోగాలు పొందిన గిరిజనుల పిల్లలు మాత్రమే ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారు. మైదాన ప్రాంత విద్యార్థులతో పోటీపడుతున్నారు. మిగిలిన వారంతా పది, ఇంటర్, సాధారణ డిగ్రీ, పీజీలతో సరిపెట్టుకుంటున్నారు. ఎవరో ఒకరిద్దరు బీఈడీ వంటి సాంకేతిక విద్యను అభ్యసించినప్పటికీ ప్రస్తుత పోటీ ప్రపంచం లో నెగ్గుకురాలేకపోతున్నారు. వీరికి ఇంజనీరింగ్, మెడిషన్ విద్యలు అందని ద్రాక్షలే. ఐఐటీ, ఐఐఎంలవంటి జాతీయ విద్యాసంస్థల పేరే తెలియడం లేదు.

మెరుగైన విద్యకు రహదారులు అవసరం..

మెరుగైన విద్యకు రహదారులు అవసరం. అవి లేక చాలా మంది గిరి జనులు చదువును మధ్యలో ఆపేస్తున్నారు. వాస్తవానికి గిరిజనులకు చదువుపై శ్రద్ధ పెరిగింది. అయితే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు గిరిజన ప్రాంతాల్లో పెట్టే పరిస్థితి లేదు. వారు కూడా ఇంజనీరింగ్, మెడిషన్ వంటి ఉన్నత చదువు లు చదవాలంటే ముందు ఆయాప్రాంతాల్లో కనీస సౌకర్యాలు మెరుగుపరచాలి.

-బొబ్బిలి రామకృష్ణ, సామాజిక కార్యకర్త, శృంగవరపుకోట

ఎస్.కోటలో ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలి..

శృంగవరపుకోటలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలి. ఈ మండలంలో కొండ శిఖర గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. చుట్టుపక్కల మండలాల్లోనూ గిరిజన అవాసాలు ఉన్నాయి. ఐదోతరగతి తరువాత దూరంగా విజయనగరంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. గిరిజన అవాసాలకు దగ్గరగా ఉంటే బాలికలను చదివించేందుకు మరింతగా ముందుకు వస్తారు.

-జె.గౌరీష్, గిరిజన సంఘ నాయకుడు, శృంగవరపుకోట

ఆలయాల మూసివేత

(ఐదో పేజీ తరువాయి)

తెరవనున్నారు.శుద్ధ జలంతో ఆలయాన్ని సంప్రోక్షణచేశాక భక్తులకు దర్శనఅవకాశం కల్పించనున్నట్టు దేవస్థానంఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు.

● బొబ్బిలిలోని చారిత్రాత్మకమైన వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు దాడితల్లి, వేంకటేశ్వరస్వామి, బంగారమ్మ, సంతోషిమాత, దేశమ్మతల్లి, ఆంజనేయస్వామి ఆలయాలను ఆదివారం సాయంత్రం మూసివేశారు. సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యసంస్కారం చేసి విగ్రహాలకు అభిషేకం చేస్తామని పలు ఆలయాల అర్చకులు వివరించారు.

ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లిన కారు

(ఐదో పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయారు. భీమాళికి చెందిన యువకుడు మిడతాన సూర్య ప్రకాశ్ తీవ్రంగాగాయపడ్డాడు. ఈ సంఘటనను గమనించిన వెంటనే సమీప ప్రాంతాల యువత పరుగున వచ్చి క్షతగాత్రుడిని తరలించేందుకు 108కి సమాచారం ఇచ్చారు. సూర్యప్రకాశ్‌ను వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించారు. కారు నడుపుతున్న వ్యక్తి ముగ్గురిని ఢీకొన్నాక సమీపంలో ఉన్న గోడను ఢీకొని ఆగిపోయాడు. కారులోని ఎయిర్‌బెలూన్ తెరుచుకోవడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు భావిస్తున్నారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే ఆయన పరారీ అయ్యాడు.

పశు సంచార వైద్యశాలల జాడేది?

(ఐదో పేజీ తరువాయి)

వైద్యం అందించాలి. సమీప పశువైద్యశాలకు తెచ్చి చికిత్స అందించాలి. కానీ మందుల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వాహనాలు సరిగా సేవలందించడం లేదన్న విమర్శలున్నాయి.జిల్లాలో అంచనాగా 4,75,805 పశువులు ఉన్నాయి. అందులో 3,77,960 ఆవులు, 97,845 గేదెలు ఉన్నాయి. అదే విధంగా గొర్రెలు 4,48,154, మేకలు 1,56,511 ఉన్నాయి. పందులు 2,585, కోళ్లు 51,26,764 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒక్క విజయనగరం నియోజకవర్గంలో ఒకటి.. మిగతా నియోజకవర్గాల్లో 2 చొప్పున పశు ఆరోగ్య సంచార వాహనాలున్నాయి. గతంలో వేల కిలోమీటర్లు తిరిగే ఈ వాహనాలు ప్రస్తుతం వందల కిలోమీటర్లకే పరిమితం అవుతున్నాయన్న విమర్శలున్నాయి. ఈ వాహన సేవలను సక్రమంగా అందిస్తే జిల్లాలో పశువుల వ్యాధులు అనేవి ఉండవు. ఈ వాహనంలో 15 రకాల రక్త పరీక్షలు చేసే ప్రయోగశాల ఉంటుంది. పశువులను వాహనంలోకి ఎక్కించి వైద్యం అందించే హైడ్రాలిక్ వ్యవస్థ ఉంటుంది. టోల్‌ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేసిన వెంటనే ఆపదలో ఉన్న పశువు వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. అవసరమైతే నిపుణులను సైతం తెచ్చి వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలి. అటువంటి కీలకమైన సంచార ఆరోగ్య వాహనాలు సరైన గాడి తప్పాయి. నిర్వహణ సరిగా లేదు. ముఖ్యంగా మందులు ఉండడం లేదు.

మెరుగ్గా సేవలు

జిల్లాలో సంచార పశు ఆరోగ్య వాహనాలు మెరుగైన సేవలందిస్తున్నాయి. మందుల కొరత అన్నదే రానివ్వకుండా చేస్తాం. ఫోన్ చేసిన వెంటనే వెళ్లి వైద్యసేవలందించేలా ఆదేశాలిచ్చాం. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.

- దామోదరరావు,ఇన్‌చార్జి, పశుసంవర్ధక శాఖ జేడీ, విజయనగరం

ఆధార్ సేవా కేంద్రాలు రెవెన్యూ కార్యాలయాల్లోనే..

(ఐదో పేజీ తరువాయి)

ప్రైవేటుగా చేయాల్సి వస్తోంది. దీని వల్ల రికార్డుల సవరణ, ఇతర అంశాలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆధార్ అనుసంధానం కాలేదని రైతులకు సంక్షేమ పథకాలు అందడం లేదు. దీనివల్ల వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భూముల వ్యవహారాలలో ఆధార్ నిర్ధారణ సేవలను చేపట్టేందుకు రెవెన్యూశాఖను యూజర్ ఏజెన్సీగా ఎంపిక చేయాలని కేంద్రాన్ని యూఐఏ కోరింది. రెవెన్యూశాఖ స్వచ్ఛందంగా ముందుకు రావడంతో రెవెన్యూశాఖకు బాధ్యతలు అప్పగించడానికి కేంద్రం, యూఐఏ అంగీకరించాయి. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది.

● ఇకపై ప్రతి తహసీల్దార్ కార్యాలయం పరిధిలో భూయజమానుల కోసం ఆధార్ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమం అమలులోకి వస్తే మండల రెవెన్యూ కార్యాలయాలలోనే వెబ్‌ల్యాండ్‌లో రైతుల భూములకు ఆధార్‌ను అనుసంధానం చేస్తారు. ప్రైవేటు ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఇందుకు రెవెన్యూశాఖ కొంత రుసుం వసూలు చేస్తుంది. రైతు సెంటు భూమి ఉన్నా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి. రెవెన్యూ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం అక్కడే రైతుల వేలిముద్రలు, ఐరిష్, అథెంటికేషన్ తీసుకుంటారు. ఆధార్ డేటాతో సరిపోల్చి ఆధార్‌నంబర్‌ను వెబ్‌ల్యాండ్ భూమి రికార్డుతో అనుసంధానం చేస్తారు.

నిర్వహణ లేక.. ప్రమాదకరంగా మారి

● ప్రీమాన్‌సూన్ తనిఖీలు లేక పొంచిఉన్న ప్రమాదం ● గ్రామీణ ప్రాంతాల్లో గాడితప్పిన విద్యుత్ వ్యవస్థ

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ నిర్వహణపై పర్యవేక్షణ లేక పోవడంతో గాడితప్పింది.ప్రధానంగా ప్రీమాన్‌సూన్ తనిఖీలు నిర్వహించకపోవడంతో ప్రమాదంపొంచిఉందన్న ఆందోళన నెలకొంది.పలుచోట్ల వైర్లు వేలాడుతుండడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు తీగలు అల్లుకున్నాయి. పలు గ్రామాల్లో రోడ్ల మధ్యలో స్తంభాలు ఉండడంతో అవస్థలుపడుతున్నారు.



వెలగవలసలో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలోగల వెలగవలసలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఇళ్లను తాకుతున్నట్లుగా వేలాడుతూ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఎటువంటి ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం భవనం మీదుగా..

కొండదేవుపల్లి అంగన్‌వాడీ కేంద్రం భవనం మీదుగా విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. ఈదురు గాలులు వీచినా, భారీ వర్షం కురిసినా తీగలు రాపిడై నిప్పులు రాలుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులకు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామని, వాటిని తొలగించాలని పలుసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు.

చర్యలు తీసుకుంటాం

వెలగవలసలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో ఆ గ్రామాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావు తెలిపారు. అలాగే కొండదేవుపల్లి అంగన్‌వాడీ కేంద్రం భవనంపై వెళ్తున్న వైర్లను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

వీధి మధ్యలో విద్యుత్ స్తంభం

రామభద్రపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికతోట బీసీ కాలనీలో మెయిన్ వీధిలో విద్యుత్ స్తంభం వీధి మధ్యలో ఉండడంతో కాల నీవాసులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో ప్రదానంగా వాహనచోదకుల ఇబ్బందిపడు తున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదని కాలనీ వాసులు, జనసేన నాయకుడు అల్లు రమేష్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చాలని వారు కోరారు.



చెరువును కాపాడండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తంగుడుబిల్లిలోని సర్వే నెంబరు 72లో ఉన్న చెరువును కాపాడాలని ఆ గ్రామానికి చెం దిన పలువురు రైతులు కోరారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఆదివారం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతీకృష్ణమూర్తినా యుడు,గౌరవాధ్యక్షుడు భారతానంద స్వామీజీ, రాష్ట్ర అధ్యక్షుడు జాగారపు ఈశ్వరప్రసా ద్‌లు గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఇక్కడి చెరువును కొందరు కబ్జా చేస్తున్నారని వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆ చెరువును ప్రభుత్వమే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

సతివాడలో పోలీసు పికెట్

నెల్లిమర్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సతివాడ గ్రామంలో వినాయక ఉత్సవాల నేపథ్యంలో బీసీలకు, దళితులకు శనివారం రాత్రి జరిగిన వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతా నికి పరిస్థితి అదుపులో ఉన్నట్టు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. సతివాడ గ్రామంలోని బీసీలు, దళితులు శనివారం రాత్రి వేర్వేరుగా వినాయక నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. అయితే విగ్రహ ఊరేగింపు రూట్ మ్యాప్ విషయంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, ఎస్ఐ బి.గణేష్ రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మరింత ఉద్రిక్త పరిస్థితి రాకుండా పోలీసు పికెట్ నిర్వహించారు. దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొంతమంది బీసీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నందివానివలస రోడ్డు నిర్మాణానికి కృషి

గరుగుబిల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నందివానివలస రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలి పారు. ఆదివారం తోటపల్లి పంచాయతీలోని పలు గ్రామాలకు రహదారి మోక్షం కల్పించాలని ఆయా గ్రామాలకు చెందిన ఎం.చిన్నంనాయుడు, ఆర్.నరసిం హనాయుడు, ఆర్.విజయ్, జి.మురళీమోహన్‌తోపాటు పలువురు జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందివానివలస ఎస్సీకాలనీ నుంచి సింగనాపురం గ్రామానికి, తోటపల్లికి రహదారిసౌకర్యం కల్పించడానికి దృష్టిసారించాలని కోరారు. ఏటావర్షాకాలం రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించ లేపోతున్నమని తెలిపారు.ఈ మార్గంలోనే జియ్యమ్మవలస మండలంలో రైతులకు చెందిన పంటపొలాలు ఉండడంతో ఏటా వారు కూడా ఇబ్బందిపడుతున్నా రని చెప్పారు.కాగా ఈ రహదారి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు.

రేపు 'అన్నదాత పోరు'

బొబ్బిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులను బ్లాక్ చేసి రైతులను తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం అన్నదాత పోరు పేరుతో ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు తెలిపారు. ఆదివారం బొబ్బిలి వైసీపీ కార్యాలయంలో అన్నదాత పోరు కార్యక్రమం గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు చోడిగంజి రమేష్‌నాయుడు, తమ్మిరెడ్డి దామోదరరావు, సావు వెంకటము రళీకృష్ణారావు, పాలవలస ఉమాశంకర్, రాయలు, లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

● పాలకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు కారక్రమం పోస్టర్‌ను పాలకొండలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆవిష్కరించారు. ఈ మేరకు మంగళవారం రైతులతో కలిసి కోటదు ర్గమ్మ జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యా లయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిప త్రం అంద జేస్తామని తెలిపారు.

మద్యం అక్రమ అమ్మకాలపై స్పెషల్ డ్రైవ్

రాజాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీం అన్నారు. ఆదివారం స్థానిక ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ స్టేషన్ పరిధిలో అనధికార మద్యం అమ్మకాలు(బెల్ట్ షాపులు) బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగడంపై మూడు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని చెప్పారు. దీనిలో భాగంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఆరుగురుపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 55 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

మద్యం సీసాలు స్వాధీనం

బెల్ట్ షాపులకు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 106 మందిపై కేసులు నమోదు చేసి, 911 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 13 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టరిత్యా నేరమని, అటు వంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చ రించారు. రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్నిమండలాల్లో తనిఖీలు చేశామని, అనధికారికంగా మద్యం అమ్మకాలుజరిగినా గ్రామాల్లో మద్యం అమ్మకాల కోసం వేలంపాటలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమాజానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు



టీచర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజానికి నిజమైన దిక్సూచి, మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని వారిని సముచితంగా గౌరవించుకోవడం మనందరి కర్తవ్యమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం బొబ్బిలి కోటలో నిర్వహించిన కార్య క్రమంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో 12 మంది ఉపాధ్యాయులుఉత్తమఉపాధ్యాయ అవార్డులు పొందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ విద్యతో వికాసం సిద్ధిస్తుందని, అది ఉపాధ్యాయుల ద్వారానే అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు రౌతు రామ్మూర్తి, రిటైర్డ్ ఎంఈవో కేతిరెడ్డి కృష్ణమూర్తి, కొల్లి రామారావు పాల్గొన్నారు.

దేశీయగోవుల పెంపకాన్ని ప్రోత్సహించాలి

బొబ్బిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):దేశీయ గోవుల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వాటి ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలని గోసేవ సమితి రాష్ట్ర ప్రతినిధి రామోజీ పిలుపునిచ్చారు. ఆదివారం బొబ్బిలిలోని బ్రహ్మకుమారీ సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుల ప్రాధాన్యత, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై కూలంకుషంగా రైతులకు వివరించారు. దేశీయగోవుల పెంపకాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. స్థానిక కేంద్రం ఇన్చార్జి బీకే రాజేశ్వరి మాట్లాడుతూ సేంద్రీయ,యోగిక వ్యవసాయం పై వివరించారు. కార్యక్రమంలో పక్కి, పెదపెంకి, భీమవరం గ్రామాలకు చెందిన రైతులు, పిరమిడ్ యోగా శిక్షకులుచంద్రమౌళి పాల్గొన్నారు.

బోర్డు తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి

బొబ్బిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీ శ్రీనివాస జూట్‌మిల్లు స్థలంలో రెవెన్యూ, ఇరిగేషన్ స్థలాలకు సంబంధించి అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును తొలగించినవారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఈ స్థలాన్ని సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి విషయంలో రెవెన్యూయంత్రాంగం స్పందించకపోతే పేదల ఇళ్లస్థలాల కోసం ఎర్ర జెండాలతో పోరాటం చేస్తామని తెలిపారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ పార్టీ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, కొలుసు వెంకటసత్యనారాయణ, వెంపల బాబ్జీ పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

బాడంగి, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను విరివిగా ఉపయోగించాలని స్పెషలాఫీసర్ కిరణ్‌కుమార్ కోరారు. ఆదివారం బాడంగి సచివాలయం-1లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నానోయూరియా వాడకం వల్ల తక్కువ ఖర్చు తో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ వరప్రసాద్, ఏవో సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కలవరాయిలో దేశతల్లి వారాలు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవరాయిలో ఆదివారం దేశతల్లి అమ్మవారి వారాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొత్స నటరాజు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజ లు చేశారు. వారోత్సవాలు ప్రతిఏటా వరి ఉబాలు పూర్తయిన తర్వాత ఆన వాయితీగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ పాటూరి సింహాచలం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొల్ల హరికృష్ణ, పాటూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సామూహిక హారతి

పెంట అన్నపూర్ణసహిత నగరేశ్వరస్వామి ఆల యంలో ఆదివారం సాయంత్రం పౌర్ణమి పురస్కరించుకుని ప్రధాన అర్చ కులు ధూపం వాసు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రగ్రహణం పురస్కరించుకొని భక్తులతో సామూహిక హారతి నీరాజనం సమ ర్పించి ఆలయం తలుపులు మూసివేశారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

రాజాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని కోరుతూ అక్టోబరు 12న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమగ్రశిక్షా ఉద్యోగుల రాష్ట్ర కమిటీ చైర్మన్ బి.కాంతారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కారాన్ని కోరుతూ అసెంబ్లీ సమావేశంలో చర్చించాలని కోరారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు ఆదివారం 78వ రోజు జాతీయ జెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు 18 ఏళ్లుగా భూములు కోల్పోయి, రోడ్డున పడ్డారన్నారు. వీరికి వెంటనే న్యాయం జరగాలని జాతీయ జెండాలతో నిరసన తెలిపారు.

కాలనీ సమస్యను పట్టించుకోవడం లేదు

జామి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక గంగిరెడ్ల కాలనీవాసుల రహదారి సమస్యను పదేళ్లగా పరిష్కరించాలని కోరుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. ఆదివారం వారు మాట్లాడుతూ రోజు పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో భయం వేస్తుందని, వృద్ధులు నడిచే సమయంలో ఎక్కడ పడిపోతారోనని భయం వేస్తుందన్నారు. దీనిపై బీజేపీ మండల అధ్యక్షురాలు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా మంత్రి, ఎమ్మెల్యే తోపాటు తమ పార్టీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తామన్నారు.

బీజేపీ నాయకులకు అవకాశం కల్పించండి

కొత్తవలస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విజయంలో తమకు భాగం ఉందని, తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల అప్పారావు, మాజీ ఉపాధ్యక్షుడు సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు రాముడు, దాశరధి, రామకోటి, సత్యనారాయణ, గోపి పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు

కొత్తవలస, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):తుమ్మికాపల్లి పంచాయతీ వినాయకనగర్‌లో ఉన్న పర్ దిపీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 45 మంది ఒంటరిగా నివాసముంటున్న వృద్ధులకు 12 రకాలైన నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో కొత్తవలస పంచాయతీ ఈవో బి.శైలజ, సర్పంచ్ మచ్చరామస్వామి, ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్, రమణ, రవి, గణేష్ పాల్గొన్నారు.

కల్లేపల్లి పీహెచ్‌సీకి మోక్షం కలిగేదెప్పుడో?

● భవన నిర్మాణంపై వీడని సందిగ్ధత

లక్కవరపుకోట, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి గ్రామంలో పీహెచ్‌సీ భవన నిర్మాణంపై సందిగ్ధత వీడలేదు. ఏళ్లు గడుస్తున్నా జిల్లా అధికారుల నిర్లక్ష్యం వైఖరితో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.1129 కోట్లతో రాష్ట్రంలోని గ్రామాల్లో 4,472 హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు మూడేళ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో కల్లేపల్లికి పీహెచ్‌సీ మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి జేసీ స్థల పరిశీలన చేసి, సుమారు 1.2 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పజెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కల్లేపల్లి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక లాబ్ టెక్నీషియన్‌ను కేటాయించారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఈ పీహెచ్‌సీ వెల్నెస్ సెంటర్‌లో నడుస్తోంది. స్థలాభావం వల్ల పూర్తిస్థాయిలో రోగులకు సేవలు అందడం లేదు. బెడ్స్ వేయడానికి జాగా లేదు. జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో మందులు కూడా సరఫరా చేయడం లేదు.



హెల్త్ క్లినిక్‌లో నడుస్తున్న కల్లేపల్లి పీహెచ్‌సీ

గ్రామస్థులు సహకరించినా.. అధికారులు స్పందించడం లేదు

గ్రామస్థులు తమకున్న వనరులలో సుమారు పది బెడ్స్ పట్టే కల్యాణ మండపాన్ని, నీటి వసతి, లేవట్రీ సదుపాయాలు కల్పించినా జిల్లా వైద్యాధికారులు స్పందించడం లేదు. గ్రామానికి ఆనుకుని సుమారు ఎకరా ప్రభుత్వ స్థలాన్ని తీర్మానం చేసి ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక్కడ పీహెచ్‌సీ నిర్వహణ వల్ల శ్రీరాంపురం, తామరాపల్లి, గంగుబూడి, కోనమసివానిపాలెం, ముసిరాం, రేగ, పెదిరెడ్ల పాలెం, నీలకంఠాపురం, లచ్చింపేట, నర్సంపేట, పోతంపేట, కుద్దువలస, లింగంపేట, పీవీపాలెం, ఎన్జీవీపాలెం గ్రామస్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

● భవన నిర్మాణ మంజూరుపై జిల్లా వైదికారులను వివరణ కోరగా ప్రభుత్వం దృష్టిలో ఉందని రెవెన్యూశాఖ, పంచాయతీ ఇంజనీరింగ్ శాఖల క్లియరెన్స్ వస్తే ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణానికి కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.